క్లుప్తంగా

దుర్గాలమ్మ ఆలయంలో పూజలు



దుర్గాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న సీఐ కాంతారావు

మధురవాడ: ఇటీవల బాధ్యతలు చేపట్టిన నార్త్‌జోన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్(పీఎం పాలెం) ఎస్.కాంతారావు జాతర గట్టుపై కొలువుదీరిన దుర్గాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. కుంకు పూజలు, పుష్పార్చనలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు పట్నాల హరిప్రసాద్‌శర్మ, మూర్తిశర్మ, ధర్మకర్త పిళ్లా చంద్రోశేఖర్, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, కమిటీ ప్రతినిధులు పిళ్లా సూరిబాబు, పీవీజీ అప్పారావు, నాగోతి తాతారావు, పిళ్లా వెంకటరమణ తదితరులు కాంతారావుకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

గోదాదేవి కల్యాణం రేపు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట దరి వారిజ ఆశ్రమం శ్రీలక్ష్మీ హయగ్రీవ మందిరంలో ఆదివారం భోగి పండగను పురస్కరించుకుని ఉదయం 9.30 గంటల నుంచి గోదా రంగనాథ కల్యాణం నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు శ్రీకాంత్‌చార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మహాన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

పశు వ్యాధులపై అవగాహన అవసరం



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సత్యశ్రీ

కొమ్మాది: పాడి పశువులకు సోకే వ్యాధులపై రైతులకు అవగాహన అవసరమని భారత్ వికాస్ పరిషత్ ఝాన్సీలక్ష్మీబాయ్ సంస్థ అధ్యక్షురాలు టి.సత్యశ్రీలక్ష్మి అన్నారు. జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది గ్రామంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గాలికుంట వ్యాధి, బ్రుసిల్లోసెస్ వ్యాధి నివారణ టీకాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం 68 పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్, హిమజ, పూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద సందేశం యువతకు శిరోధార్యం



వివేకానంద చిత్రపటానికి పూలమాల వేస్తున్న వీసీ కె.సమత

ఏయూ క్యాంపస్: భారతీయ యువతకు స్ఫూర్తి ప్రదాతగా స్వామి వివేకానంద నిలుస్తారని ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత అన్నారు. వివేకానంద జయంతి, యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూ ఈసీ హాల్‌లో స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ స్వామి వివేకానంద సందేశం యువతకు శిరోధార్యమన్నారు. సనాతన ధర్మానికి రాయబారిగా, మహోన్నత వాగ్ధాటితో భారతదేశ సంస్కృతి వారసత్వాన్ని ప్రపంచానికి వివేకానంద పరిచయం చేశారన్నారు. భారతీయ యువతకు దిశానిర్దేశం చేసిన ఆయన నేటి యువతకు ఆదర్శనీయమన్నారు. భారతీయుల్లో జాతీయవాద స్ఫూర్తిని నింపడంలో, యువతకు మార్గనిర్దేశం చేయడంలో ఆయన ప్రసంగాలు ఎంతో ప్రభావవంతంగా నిలిచాయన్నారు. వివేకానందుని బోధనలు మానవాళికి మార్గదర్శనం చేస్తూనే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య రహమాన్, ఏయూ ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ఏపీ ఉన్నత విద్యా మండలి సెక్రటరీ అహ్మద్ నజీర్, అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో నిత్య సంక్రాంతి



ఎడ్లను పరిశీలిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కోలా గురువులు

- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

తగరపువలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరంతరం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కారణంగా రాష్ట్రంలో ఏడాది పొడవునా సంక్రాంతి పర్వదినంలా సాగుతోందని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా భీమిలి అర్బన్, పద్మనాభం మండల ప్రజాప్రతినిధులకు సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడం ద్వారా సంక్రాంతిని మళ్లీ మళ్లీ జరుపుకోవచ్చన్నారు. ఈ నాలుగేళ్ల 9 మాసాలలో ఎక్కడా అవినీతికి, వివక్షతకు తావు లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా గరిష్టంగా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అన్నారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యత కల్పిస్తూ ఇటీవల వైద్యాన్ని కూడా ఇంటి వద్దనే అందిస్తున్నారన్నారు. త్వరలో రాష్ట్రంలోని ఐదు ప్రాంతాలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటించి కార్యకర్తలు, నాయకులతో సమేకం కానున్నారన్నారు. ఉత్తరాంధ్రకు సంబంధించి ఈ కార్యక్రమం ఈ నెల 25న భీమిలిలో ఉండవచ్చన్నారు. చంద్రబాబు, పవన్‌లు రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు మరోమారు బయలు దేరారని వైవీ సుబ్బారెడ్డి విమర్శించారు.

భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలోనే సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుండి ఇతర రాష్ట్రాలకు మారగదర్శిగా నిలిచారన్నారు. నియోజకవర్గంలోని 64 పంచాయతీలలో 5 నుంచి 10 సార్లు తిరిగిన, 125 సచివాలయాల పరిధిలో 3 లక్షలకు పైగా ఓటర్లను కలిసిన ఏకైక ఎమ్మెల్యే తానేనన్నారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు సమస్య పరిష్కరించామన్నారు. దివీస్ సాయంతో 6 ఎకరాలలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం చేపడతామన్నారు. పంచగ్రామాల సమస్య కోర్టు పరిధిలో ఉందన్నారు. విశాఖ పార్లమెంట్ అభ్యర్థిగా బొత్స ఝాన్సీ పేరు ప్రకటించడం హర్షణీయమన్నారు. ఈ వేడుకల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, రీజనల్ యూత్ కో ఆర్డినేటర్ ముత్తంశెట్టి నందీష్, జీవీఎంసీ విప్ డాక్టర్ ముత్తంశెట్టి ప్రియాంక, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, వ్యవసాయ శాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, కో–ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, ఎంపీపీ కె.రాంబాబు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, శిష్టకరణాల రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి, పార్టీ అధ్యక్షులు గాడు శ్రీను, బంక సత్యం, కోరాడ లక్ష్మణ, శిల్లా సరళారాణి, చిల్ల భాస్కరరెడ్డి, అల్లిపిల్లి నరసింగరావు, జిల్లా కార్యదర్శులు జీరు వెంకటరెడ్డి, మద్దిల వెంకట రమణ, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, శిల్లా కరుణాకరరెడ్డి పాల్గొన్నారు.



భోగిమంటలను వెలిగించిన వైవీ సుబ్బారెడ్డి, ముత్తంశెట్టి శ్రీనివాసరావు



పిండివంటలు రుచి చూస్తున్న వైవీ సుబ్బారెడ్డి

సందడిగా పండగ సంబరాలు



చిట్టివలస బంతాట మైదానంలో భోగిమంట వేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

- కార్మికవాడలో కోలాహలం
- ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు

తగరపువలస: చిట్టివలస కార్మికవాడకు సంక్రాంతి సందడి ముందే వచ్చింది. జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. ముగ్గుల పోటీల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళలు ఉత్సాహంగా పాల్గొని, రంగవల్లులను చూడచక్కగా తీర్చిదిద్దారు. భీమిలికి చెందిన మేరుగు వెంకటలక్ష్మి జగనన్న సంక్షేమ పథకాలను ముగ్గులో పొందుపరిచి, ప్రశంసలు అందుకున్నారు. కుర్చీలాట, ముగ్గుల పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు బహుమతులు అందించారు. అనంతరం ఆయన బంతాట మైదానంలో భోగిమంట వేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు సంక్రాంతి స్వీట్లు పంపిణీ చేశారు. హరిదాసు సందడి చేశారు. కార్యక్రమంలో భీమిలి జెడ్పీ బి.రాము, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, 2వ వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, యూత్ అధ్యక్షుడు అక్కరమాని చినబాబు, నాయకులు జీవీ రమణ, పందిరి విజయ్, జీరు సుజాత, శిల్లా కరుణాకరరెడ్డి, చిల్ల సూర్యనారాయణరెడ్డి, పందిరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

- సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు జరిగాయి. గ్రామీణ వాతావరణాన్ని తలపించేలా తాటాకుల ఇళ్లు, అరుగులు, పశువులతో తీర్చిదిద్దారు.

ఆనందపురం : ఆనందపురంలోని గాయత్రి కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు, కోలాటం, గాలిపటాలు ఎగరవేయడం, డూడూ బసవన్న విన్యాసాలు, భోగిమంటలు, హరిదాసు వేషధారణలతో అంతటా పండగ వాతావరణం నెలకొంది.



సంగివలస ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో..



రంగవల్లులు వేస్తున్న విద్యార్థులు



చిట్టివలసలో రంగవల్లులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి



జగనన్న సంక్షేమ పథకాలను తెలియజేస్తూ మేరుగు వెంకటలక్ష్మి తీర్చిదిద్దిన ముగ్గు

యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద



ఆర్‌వీ పురం హైస్కూల్లో వివేకానందుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్‌ఎంసీ చైర్మన్ రామస్వామి



మధురవాడలో నివాళులర్పిస్తున్న పౌర సంక్షేమ సంఘం సభ్యులు

పద్మనాభం: స్వామి వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకుని యువత ముందడుగు వేయాలని ఆర్‌వీ పురం హైస్కూల్ హెచ్‌ఎం విజినిగిరి శంకరరావు అన్నారు. మండలంలోని ఆర్‌వీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వివేకానందుడి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ స్వామి వివేకానంద భారత ఖ్యాతిని విదేశాల్లో చాటారన్నారు. ఈ సందర్భంగా స్వామి వివేకానందుడి విగ్రహానికి ఎస్‌ఎంసీ చైర్మన్ కర్రి రామస్వామితో కలిసి శంకరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

మధురవాడ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు శివశక్తినగర్ రోడ్డులోని అయ్యప్పనగర్‌లో ఉన్న స్వామీ వివేకానందుని విగ్రహానికి మధురవాడ పౌర సంక్షేమ సంఘం సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు, ప్రముఖ ప్రవచన కర్త పెద్దాడ శ్రీరామమూర్తి, సంఘం కార్యదర్శి శ్రీపాద వెంకట రమణ, కోశాధికారి ఎస్.జగన్మోహన్‌చౌదరి, కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఎస్.రమేష్, వై.శంకరరావు, బెల్లాపు పాపారావు, డాక్టర్ బీఎస్ రావు, బ్రిక్స్ శ్రీనివాస్, బైపిల్లి సతీష్, కావ్యరెడ్డి పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత వివేకానంద

తగరపువలస: ఆధ్యాత్మిక గురువు, యువతరానికి స్ఫూర్తి ప్రదాత అయిన స్వామి వివేకానందుని 162వ జయంతి సందర్భంగా భీమిలి ఆదర్శహిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో భీమిలిలో నివాళులు అర్పించారు. మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు పాల్గొన్నారు.

- భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో వివేకానందుడి జయంతిని నిర్వహించారు. చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు గొట్టిపల్లి సత్యనారాయణ బహుమతులు అందించారు.



వివేకానందుడికి నివాళులు అర్పిస్తున్న ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ప్రతినిధులు

ప్రముఖ వర్తకుడు ప్రసాదరావు మృతి



తగరపువలస: ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన ప్రముఖ వర్తకుడు చెన్నా ప్రసాదరావు శుక్రవారం మధ్యాహ్నం గుండెపోటుతో మరణించారు. ఆయన అంత్యక్రియలు శనివారం పెద్దిపాలెంలో జరగనున్నాయి. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరునిగా ఉన్న ప్రసాదరావుకు పెద్దిపాలెంలో రైస్‌మిల్లుతో పాటు ఇటీవల ప్రారంభించిన చెన్నా కన్వెన్షన్ హాలు ఉంది. ప్రసాదరావు మృతిపై పలువురు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఆయనకు భార్య, ఇద్దరు తమ్ముళ్లు, కుమారుడు వెంకటేష్ ఉన్నారు.

జీవీఎంసీ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ



గ్రంథాలయ ఉద్యోగి తవుడును సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

తగరపువలస: స్వామి వివేకానందుని జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక జీవీఎంసీ గ్రంథాలయానికి బీజేపీ నాయకులు అంబేడ్కర్, స్వామి వివేకానందుడి జీవిత చరిత్రల పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యోగి జోగ తవుడును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, బీఎస్ఎన్ఎల్ సలహా మండలి సభ్యుడు పంపాన శ్రీధర్, పివివి ప్రసాదరావు, ఎం.వెంకటశివ, ఎం.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికా కమిటీలు అభివృద్ధి పనులు పరిశీలించాలి

ఆనందపురం : గ్రామ పంచాయతీలో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రణాళికా కమిటీలు పరిశీలించాలని ఈవోపీఆర్డీ కెల్ల రామారావు సూచించారు. పంచాయతీ సిబ్బంది, ప్రణాళికా కమిటీ సభ్యులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక సంఘం నిధులలో ఎన్ఆర్ఈజీఎస్, జల జీవన్ మిషన్, హెల్త్ గ్రాంట్ తదితర వాటితో చేపట్టే పనులను పరిశీలన చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన తొమ్మిది థీమ్‌లలో ఏదో ఒక దానిని ఎంచుకుని పనులు చేపట్టాలని చెప్పారు. గతంలో అమలు జరిపిన ప్రణాళికలను పరిశీలించాలన్నారు. కుల గణన విషయంలో కచ్చితత్వం పాటించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, ప్రణాళికా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రాక్పశ్చిమ సమన్వయం ఒక యజ్ఞం

మహారాణిపేట : ప్రాక్పశ్చిమ ఆధ్యాత్మిక సమన్వయమనేది పవిత్రమైన యజ్ఞమని జగద్గురు పీఠం భౌగోళిక కో–ఆర్డినేటర్ జర్మన్ దేశీయుడు లుడ్జర్ ఫిలిప్స్ పేర్కొన్నారు. అంకోసా ఫంక్షన్ హాలులో శుక్రవారం జగద్గురు పీఠం సోదర బృందం నిర్వహించిన ప్రాక్పశ్చిమ సభా కార్యక్రమంలో ఆయన ప్రధాన ప్రసంగం చేశారు. సంస్థ వ్యవస్థాపకులు మాస్టర్ ఈకే, గతంలో భౌగోళికంగా సేవలందించిన మాస్టర్ కె.పార్వతీకుమార్ వివిధ దేశాల్లో చేసిన ప్రసంగాలు, వారు రాసిన గ్రంథాల్లో ఉన్న పరమ గురువుల మార్గానికి నేడు వేలాది మంది పాశ్చాత్యులు ప్రభావితం చెందుతున్నారన్నారని లుడ్జర్ వివరించారు. సభకు అధ్యక్షత వహించిన సంస్థ భౌగోళిక నిర్వాహకులు కె. గురుప్రసాద్ మాట్లాడుతూ ప్రాక్పశ్చిమ యజ్ఞ నిర్వహణలో భాగంగా మాస్టర్ పార్వతీకుమార్ 65 పర్యాయాలు విదేశాలలో పర్యటించారన్నారు. మాస్టర్ ఈకే రాసిన ఓవర్సీస్ మెసేజెస్ 8వ సంపుటాన్ని, అలాగే పార్వతీకుమార్ రాసిన సెవెన్ రేస్ ఆఫ్ లైట్ అనే జర్మన్ అనువాద గ్రంథాన్ని ఆవిష్కరించారు. స్పెయిన్ వనిత డోనా, అర్జెంటీనాకు చెందిన రేయన్స్, సంస్థ కార్యదర్శి బీఆర్‌కే రాజు, అజ్జరపు శ్రీనివాస్, జ్యోతిషాచార్య ఎస్ఎస్ఎస్ రాము, బాలభాను విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్. శుభశ్రీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లుడ్జర్

సీ ఫుడ్ ఎగుమతులపై సాంకేతిక నిపుణులకు శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న సాంకేతిక నిపుణులు

ఆనందపురం : మండలంలోని గంభీరంలో ఉన్న ఎగుమతుల తనిఖీ కేంద్రం (చెన్నై సబ్ ఆఫీసు)లో సీఫుడ్స్ ఎగుమతిదారులకు సాంకేతిక నిపుణులతో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీఐఎఫ్‌టీ సైంటిస్ట్ బి.మధుసూదనరావు, డిప్యూటీ డైరెక్టర్ జయపాలన్, అసిస్టెంట్ డైరెక్టర్ సుధాన్షు శేఖర్‌దాస్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మైక్రోబయాలజీ కెమికల్ టెస్టింగ్, జీవోఐ నోటిఫికేషన్, జీఎంపీ, ఎస్ఎస్‌వోపీ, హెచ్ఏసీసీపీ దిగుమతి చేసుకునే దేశాల అవసరాలు, ఫిర్యాదుల నిర్వహణ విధానాలపై ఐదు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం కొనసాగనుంది. విశాఖ కాకినాడ రీజియన్‌కు చెందిన సీఫుడ్ ఎగుమతికి సంబంధించి 20 మంది సాంకేతిక నిపుణులకు ఈ శిక్షణను అందించి, ధ్రువపత్రాలను అందజేస్తారు. నాణ్యమైన ఉత్పత్తులను ఎగుమతి చేయడమే లక్ష్యంగా శిక్షణ పొందిన నిపుణులు పని చేస్తారు.

భీమిలిలో కెనరా బ్యాంక్ సేవలు



కెనరా బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభిస్తున్న జనరల్ మేనేజర్ రవివర్మ

కొమ్మాది: భీమిలిలో కెనరా బ్యాంక్ సేవలు ఇక నుంచి అందనున్నాయని విజయవాడ బ్రాంచ్ సర్కిల్ హెడ్, జనరల్ మేనేజర్ పి.రవివర్మ అన్నారు. వాటిని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. బ్యాంక్ బ్రాంచ్‌ను భీమిలిలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్.మధుసూదనరావు, డివిజనల్ మేనేజర్ ఐ.వి.కె.ప్రభు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి పోటీలకు ఆహ్వానం

తగరపువలస: చిట్టివలస ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా పలు పోటీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈ నెల 14న సత్యసాయి సేవాసమితి పక్కన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ముగ్గుల పోటీలు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 వరకు ఉట్టి కొట్టే పోటీలు నిర్వహించనున్నారు. 15వ తేదీ సాయంత్రం 4 గంటలకు పిల్లలకు, పెద్దలకు వేర్వేరుగా కుర్చీలాట, 6 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, 7 గంటలకు 12 ఏళ్లలోపు చిన్నారులకు ఫ్యాషన్ షో, వెస్ట్రన్ డాన్స్, మిమిక్రీ, మ్యాజిక్ షో అనంతరం బహుమతుల పంపిణీ ఉంటుంది. కార్యక్రమాలలో పాల్గొనాలనుకునేవారు 91827 96294, 99859 57499, 99492 28528 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా కూడార్రై ఉత్సవం

సింహాచలం: సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ధనుర్మాస పూజల్లో భాగంగా శుక్రవారం కూడార్రై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాశుర విన్నపం, సాత్తుమొర్రై, ధనుర్మాస పూజలు జరిపారు. కూడార్రై ఉత్సవ విన్నపపారాయణ చేశారు. ఈ సందర్భంగా అర్చకులు నృత్యాలు చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈపూజలు నిర్వహించారు.

తీర ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దండి



సుందరీకరణపై సూచనలిస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్ : విశాఖ సాగర తీరాన్ని పచ్చదనం, పరిశుభ్రతతో పాటు ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. ఆర్కేబీచ్ నుంచి భీమిలి బీచ్ రోడ్డు వరకు సెంట్రల్ మీడియన్, గార్డెన్లు, వర్టికల్ గార్డెన్లు, పలు రోడ్లు, ఫుట్‌పాత్‌లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖకు ఎంతో సువిశాలమైన తీర ప్రాంతం ఉందని, ఎంతో మంది సందర్శకులు, పర్యాటకులు నగరానికి వస్తారని, వారందరికీ ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు నగర సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టీ కల్చర్ దామోదరరావును ఆదేశించారు. అలాగే సెంటర్ మీడియన్‌లో ఆకర్షణీయమైన మొక్కలు దగ్గరగా వేసి నిరంతరం పర్యవేక్షించాలని, సెంటర్ మీడియన్ల వద్ద రోడ్లపై పడిన మట్టిని వెంటనే స్వీపింగ్ మెషీన్ల ద్వారా పరిశుభ్రపరచాలని ఆదేశించారు. కొన్ని చోట్ల మొక్కల నిర్వహణ సరిగ్గా లేదని, పటిష్టమైన చర్యలు చేపట్టాలని డీడీహెచ్‌ను ఆదేశించారు. గాదిరాజు ప్యాలెస్, ఇతర బీచ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వర్టికల్ గార్డెన్లను అందంగా తీర్చిదిద్దుతూ నిరంతరం పర్యవేక్షించాలని, సెంటర్ మీడియన్‌లో మొక్కలను పశువులు తినకుండా నిరంతరం నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జోన్–3 కమిషనర్ విజయలక్ష్మి, అసిస్టెంట్ ఇంజినీర్ సురేష్ పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఏయూ విద్యార్థులు



శిబిరంలో పాల్గొంటున్న విద్యార్థులను అభినందిస్తున్న వీసీ కె.సమత

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం వలంటీర్లు జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికయ్యారు. ఈ మేరకు వారిని ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలలో భాగం కావడం వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. సమూహంగా పనిచేయడం, కార్యసాధక నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. ఇటువంటి శిబిరాలను సద్వినియోగం చేసు కుంటూ విద్యార్థులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏయూ జాతీయ సేవా పథకం సమ న్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, ప్రోగ్రాం అధికారి అనసూయ తదితరులు పాల్గొన్నారు. ఏయూ పరిధిలోని జీవీపీ కళాశాల విద్యార్థిని జి.కావ్య దేవి, డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల విద్యార్థిని ఎ.చూడామణి, ఏయూ ఆర్ట్స్ కళాశాల విద్యార్థి వి.రామరాజు, టీఎస్ఆర్–టీబీకే డిగ్రీ కళాశాల విద్యార్థి వై.విశ్వమోహన్ హైదరాబాద్‌లో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరిగే జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొననున్నారు.